క్లుప్తంగా

నేడు సైన్స్ ఇన్నోవేషన్

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సైన్స్ ఇన్నోవేషన్ ఫెయిర్–2025 కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ సవరపు రవణ తెలిపారు. సైన్స్, పజిల్స్‌పై పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్క పాఠశాల నుంచి విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు.

నేటి నుంచి చేతివృత్తులవారికి శిక్షణ



పాలకొండ: నగర పంచాయతీలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న చేతి వృత్తువారికి గురువారం నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చేతివృత్తుల వారి జీవనోపాధులు పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో హోమ్ ట్రయాంగిల్ ప్లాట్ ఫారం సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు కూడ అందజేస్తామని చెప్పారు. అర్హులైన వారు నగర పంచాయతీ కార్యాలయానికి పూర్తి వివరాలతో హాజరుకావాలని కోరారు.

వైకుంఠ ఏకాదశి రేపు

గరుగుబిల్లి: ఉత్తరాంధ్ర చినతిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి శ్రీకోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి నిర్వహించనున్నారు. పాంచరాత్ర ఆగమానుసారంగా ఉదయం సుప్రభాతసేవ, నిత్యారాధన, పాశుర విన్నపం, శాత్తుమురై, మంగళాశాసనం తదితర కార్యక్రమాలు నిర్వహించిన పిమ్మట 8 గంటలకు ఉత్తరద్వార దర్శనం ప్రారంభించనున్నారు. అందులో భాగంగా శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి కోదండరామస్వామి ఆలయం వరకు స్వామివారిని హన్‌మత్ వాహనంపై తిరువీధి ఊరేగింపును నిర్వహించనున్నారు. కార్యక్రమాలలో భక్తులు అధికంగా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదం స్వీకరించాలని ఈఓ సూర్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన అనిల్‌కుమార్ లిమ్మ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కళిగొట్టు జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రం గుణుపూర్ సమీపంలోని నిమ్మలగూడకు చెందిన అనిల్‌కుమార్ లిమ్మ ఒడిశాలోని సందుబడి గ్రామంలో జరిగే ఓ శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గ మధ్యలో గుమ్మలక్ష్మీపురం మండలం కళిగొట్టు జంక్షన్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అనిల్‌కుమార్‌ను భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం గుణుపూర్‌లోని ఆస్పత్రికి బంధువులు తరలించారు.

నివాళులు..



శ్రీరాములనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నడుకూరు గ్రామస్తులు

వీరఘట్టం: మాజీ మంత్రి, నిస్వార్థ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దివంగత గొర్లె శ్రీరాములనాయుడు 20వ వర్ధంతిని మండలంలోని నడుకూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడు శ్రీరాముల నాయుడని కొనియాడారు. కార్యక్రమంలో వైవీ నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు వై.జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతుసంఘ సమావేశం



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

భామిని: మండల రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై చర్చించడానికి అనువుగా మండల రైతు సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, మండల గౌరవాధ్యక్షుడు బి. అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతు సమస్యలపై చర్చించడానికి ఏపీ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా హాజరై రైతు సమస్యలపై చర్చిస్తారన్నారు. అనంతరం అర్ధంతరంగా నిలిచిన కొండలోయ గెడ్డ రిజర్వాయర్, లిఫ్ట్ ఇరిగేషన్ స్థలాలు పరిశీలిస్తారని చెప్పారు. సమావేశంలో ఏపీ రైతు సంఘ మండల శాఖ అధ్యక్షుడు జి.లక్ష్మీపతి నాయుడు, ప్రధాన కార్యదర్శి కొత్తకోట బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

● హెల్మెట్‌ధారణ తప్పనిసరి..



ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్సై సంజీవ్ అన్నారు. స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. - సీతంపేట

● కఠిన చర్యలు తప్పవు..



నిషేధిత పదార్థాలు, సారా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బాలమురళీకృష్ణ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ప్రత్యేక కోర్టు నిర్వహించారు. ఈ క్రమంలో స్థానిక ఎక్సైజ్ శాఖ పరిధిలోని పాత ముద్దాయిలు, నేరస్తులపై బైండోవర్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ నేపథ్యంలో అసాంఘిక చర్యలకు పాల్పడినా, శాంతిభద్రలతకు విఘాతం కల్పించాలని చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై ఫణీంద్ర, డీటీ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు. పాలకొండ రూరల్:

● గ్యాస్ సిలిండర్ల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి



గ్యాస్ సిలిండర్ల వాడకంలో జాగ్రత్తలు పాటించాలని గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక సిబ్బంది ఎం.తిరుపతిరావు, ఎ.తిరుపతినాయుడు, పి.గౌరీశంకరరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురం జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండేన్ గ్యాస్ గొడాం వద్ద స్థానికులకు గ్యాస్ ప్రమాదాలు, వాటి నివారణ చర్యలపై బుధవారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్యాస్ గొడాం నిర్వాహకులు కొండగొర్రి సంఘంనాయుడు తదితరులు పాల్గొన్నారు. –గుమ్మలక్ష్మీపురం:

కందిపప్పు కొందరికే..



కందిపప్పు

- సీతంపేట ఏజెన్సీలో 20 శాతం మంది లబ్ధిదారులకు అందని సరుకు
- 8 రేషన్‌డిపోలకు కందిపప్పు సరఫరా నిల్
- ఆందోళనలో లబ్ధిదారులు
- పండగపూట తప్పని అవస్థలు

సీతంపేట: ఏజెన్సీలో పరిధిలోని రేషన్ డిపోల్లో తెల్ల కార్డుదారులకు సబ్సిడీపై పంపిణీ చేయాల్సిన కందిపప్పును కూటమి సర్కార్ కొంతమందికే పరిమితం చేసింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కందిపప్పు ఈ నెలలో తమ డిపోలకు రాదంటూ డీలర్లు చేతులెత్తేస్తున్నారు. పొల్ల, టిటుకుపాయి, మానాపురం, దోనుబాయి, కిల్లాడ, తదితర 8 రేషన్ డిపోలకు 30 క్వింటాళ్ల వరకు కందిపప్పు సరఫరా చేయాల్సి ఉంది. ఆయా డిపోల పరిధిలో సుమారు 2,500 వరకు తెల్లరేషన్ కార్డుదారులకు కందిపప్పు సప్లై కాకపోవడం గమనార్హం. రేషన్ డిపోల ద్వారా కందిపప్పు కిలో 67 రూపాయలకు సరఫరా చేస్తారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర కిలో రూ.170 వరకు ఉంది. సంక్రాంతి పూట కూడా సక్రమంగా సరఫరా



చేయకపోతే ఎలా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటడంతో అవస్థలు పడుతున్నామన్నారు. కొద్దిరోజుల కిందటవరకు కందిపప్పు కొరత ఉండడంతో మార్కెట్లో కొనుగోలు చేయలేక లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. తాజాగా ప్రభుత్వం రేషన్‌కార్డుదారులందరికీ కందిపప్పు ఇవ్వకపోవడంతో బయట మార్కెట్‌లో అత్యధిక ధరలకు కొనుగోలు చేయక తప్పని పరిస్థితి నెలకొంది.

ఇలా చేయడం తగదు..



లబ్ధిదారులకు పండగపూట కూడా కందిపప్పు సరఫరా చేయకపోతే ఎలా?. రెండు నెలలుగా పరిస్థితి ఇంతే. కొంతమందికి రేషన్ డిపోల ద్వారా సరఫరా చేస్తే మరికొందరికి ఇవ్వడం లేదు. సంక్రాంతికి పిల్లాపాపలు, బంధువులతో పండగ చేసుకునే వారు బయట కొనుగోలు చేయాలంటే కష్టమే. – నిమ్మక అరుణ, సర్పంచ్, టిటుకుపాయి

80 శాతం పంపిణీ చేశాం..

కొన్ని రేషన్ డిపోలకు కందిపప్పు సప్లై చేయని మాట వాస్తవమే. మాకు సరఫరా అయిన కందిపప్పును 80 శాతం వరకు పంపిణీ చేశాం. మిగిలిన 20 శాతం కందిపప్పు రాలేదు. వచ్చిన వెంటనే రేషన్ డిపోలకు సప్లై చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌బాబు, సివిల్ సప్‌లైస్ డీటీ

పంపిణీ చేయాలి..



ఇప్పటికై నా కందిపప్పు సప్లై చేయాలి. కేవలం మా పంచాయతీల పరిధిలోనే పంపిణీ చేయకపోవడం గమనార్హం. బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. ముఖ్యమైన కందిపప్పు ఇవ్వడం లేదు. రానున్న రెండు రోజుల్లో నైనా సరఫరా చేయాలి. – శివ, పొల్ల, లబ్ధిదారుడు

పెదమేరంగి హైస్కూల్‌లో పానెల్ ఇన్‌స్పెక్షన్



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి ఉన్నత పాఠశాలలో బుధవారం పానెల్ ఇన్‌స్పెక్షన్ జరిగింది. కురుపాం ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు ఆధ్వర్యంలో ఏడుగురు సబ్జెక్ట్ ఉపాధ్యాయుల పాల్గొన్నారు. అన్ని తరగతుల విద్యార్థుల నోట్ పుస్తకాలు, పాఠ్య ప్రణాళికలు పరిశీలించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం సమీక్షించారు. సబ్జెక్ట్ ఉపాధ్యాయులు పరిశీలించిన వివరాలను సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు.

డిప్యూటీ ఈఓ పాఠశాల సందర్శన

పాలకొండ డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తి 10వ తరగతి విద్యార్థుల సిలబస్, నోట్ పుస్తకాలు, పరీక్షలకు సన్నద్ధత తీరును అడిగి తెలుసుకున్నారు. పరీక్షల విభాగానికి సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో పనులు



జీపీడీపీ గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ తోయక సీతమ్మ

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని లుంబేసు సర్పంచ్ తోయక సీతమ్మ అన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)కు సంబంధించి గ్రామ సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్‌లోని 29 అంశాలపై సమీక్ష నిర్వహించి ఆయా పనుల కోసం తీర్మానాలు చేశారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి చేపట్టిన తీర్మానాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయడం జరుగుతుందని సర్పంచ్ సీతమ్మ పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు ఎం.గౌరమ్మ, గ్రామ సచివాలయం సిబ్బంది, వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తోయక మాధవరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన పంటలు

- ఆవేదనలో రైతులు
- తూతూమంత్రంగా అటవీశాఖ చర్యలు



ఏనుగులు ధ్వంసం చేసిన నాగిరెడ్డి సత్యం నాయుడు వరిచేను కుప్పలు

కొమరాడ: 2018 సెప్టెంబర్ నెలలో వచ్చిన అటవీ ఏనుగుల గుంపు వలన ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం జరుగుతున్నప్పటికీ పాలకుల పరిష్కార చర్యలు కానరావడం లేదు. ఈ ఆరేళ్లలో సుమారు 14 మంది ఏనుగుల దాడిలో మృతిచెందగా..వందలాది ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. ఈ మేరకు కొమరాడ మండలంలోని కళ్లికోట, దుగ్గి, గుణానుపురం, కుమ్మరిగుంట, గంగరేగువలస తదితర గ్రామాల్లో రైతులు లక్షల్లో పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న కూరగాయల పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగులు ధ్వంసం చేస్తుండడంతో రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. మంగళవారం రాత్రి, బుధవారం కూడా ఏనుగుల గుంపు రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన నగిరెడ్డి సత్యం నాయుడు, గొర్లి గౌరీశ్వరరావు, సింహాచలం తదితరులు టమాటో, వరి, అనప, జొన్న పంటలను ధ్వంసం చేశాయి. అయినప్పటికీ అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారే తప్ప నష్ట పరిహారం మంజూరుకు చర్యలు చేపట్టడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. ఇప్పటికై నా అధికారులు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

నష్టపరిహారం మంజూరు చేయాలి

ఏనుగుల గుంపు ధ్వంసం చేయడం వల్ల సాగు చేస్తున్న టమాటో పంట నాశనమైంది. కూరగాయాల సాగే వృత్తిగా భావించి జీవనం సాగిస్తున్నాం. ఏనుగుల వల్ల పంట పూర్తిగా నాశనమైంది. అటవీశాఖ అధికారులు స్పందించి జరిగిన నష్టానికి పరిహారం అందజేసి ఆదుకోవాలి.

గొర్లి గౌరీశ్వరరావు, రాజ్యలక్ష్మీపురం. కొమరాడ మండలం

ప్రమాదాల నియంత్రణకు చర్యలు



రహదారి పరిధిలో తొలగిస్తున్న పిచ్చి మొక్కలు

గరుగుబిల్లి: రహదారి ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని స్థానిక ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని గరుగుబిల్లి – పార్వతీపురం ఆర్‌అండ్‌బీ రహదారి పరిధిలో గొల్లవానివలస మలుపు వద్ద సూచిక బోర్డును సరిచేయడంతో పాటు రహదారి పరిధిలో వున్న పిచ్చిమొక్కలను బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారికి ఇరువైపుల వున్న పిచ్చి మొక్కలు కారణంగా వాహన చోదకులకు రహదారి పూర్తి స్థాయిలో కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వాహన చోదకులు రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈయనతో పాటు సిబ్బంది అచ్చుతరావు తదితరులున్నారు.

లైంగిక దాడుల నిర్మూలనే ధ్యేయం

● బాలల సంరక్షణ విభాగం అధికారి శ్రీధర్



బాలికలకు అవగాహన కల్పిస్తున్న బాలల సంరక్షణ అధికారి శ్రీధర్

వీరఘట్టం: బాల్య వివాహాలు, లైంగిక దాడుల నిర్మూలనే ధ్యేయంగా మహిళా సంక్షేమ శాఖ పనిచేస్తోందని మన్యం జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల కంప్రెషన్ ఆఫీసర్ పి. శ్రీధర్ తెలిపారు. బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు గుడ్‌టచ్/బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైల్డ్ మ్యారేజ్, పీఓసీఎస్ఓ పోక్సో చట్టం, పిల్లల హక్కులు, గుడ్/బ్యాడ్ టచ్‌పై వివరించారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అప్పుడే భారతదేశంలో కిశోర వికాసం వస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు, మహిళా శిశు సంక్షేమ శాఖ పాలకొండ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, జ్ఞానమ్మ, హైస్కూల్ ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంద, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్‌కో ఈఈ కె.గోపాలరావు నాయుడు ఆదేశాల మేరకు 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులతో పాటు విద్యుత్ లైన్లకు ఆనుకొని వున్న చెట్టు కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు ఏఈ బి.శ్రీనివాసనాయుడు బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉల్లిబద్ర, సీతారాంపురం, కొంకడివరం తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. నాగూరు, కుదమ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో నిర్వహణ పనులు చేపడుతున్నప్పటికీ ప్రత్యామ్నాయంగా వీరఘట్టం ఫీడర్ నుంచి ఆయా గ్రామాలకు విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్న తరుణంలో ఆయా గ్రామాల వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

40 మందికి ఉద్యోగాలు

సీతంపేట: హైదరాబాద్‌కు చెందిన సుదర్శని సొల్యూషన్ సంస్థలో 40 మందికి ఉద్యోగాలు వచ్చాయని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు తెలిపారు. గూగుల్ మ్యాప్ ఇంజినీర్లుగా ఉద్యోగాలు పొందిన వారికి బుధవారం ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు.

పంచభూతాల పరిరక్షణ అందరి బాధ్యత

గరుగుబిల్లి: పంచభూతాలను సంరక్షించుకొంటేనే సర్వ మానవాళికి మనుగడ వుంటుందని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన 'నీటి నేస్తం' కార్యకర్తలకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, జట్టు సంస్థ సహకారంతో బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ పంచభూతాలను సంరక్షిస్తే రుతువులు సక్రమంగా వస్తాయని తద్వారా అన్ని జీవరాశుల మనుగడకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు ప్రకృతి సేద్య విధానంతో పంటలను పండించాలన్నారు. నీరు వృథా కాకుండా, పారే నీటిని నిలబెట్టడం, నిలబెట్టే నీటిని భూమిలోకి ఇంకింపజేయడం తదితరమైనవి చేయడంపై 'నీటి నేస్తం' కార్యకర్తలకు రిసోర్సుపర్సన్ మహేష్ అవగాహన కల్పించారు. జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్, కో డైరెక్టర్ నూకం నాయుడు, జట్టు ఫీల్డు కో ఆర్డినేటర్లు, రెండు మండలాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

తట్టికేల మృతి పార్టీకి తీరనిలోటు..



పాలకొండ రూరల్: రామచంద్రరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, తదితరులు

పాలకొండ రూరల్: డోలమడ పంచాయతీకి చెందిన తట్టికేల రామచంద్రరావు (72) మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. రామచంద్రరావు మృతి విషయం తెలుసుకన్న ఎమ్మెల్సీ బుధవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కనపాక సూర్యప్రకాష్, పాండ్రంకి హైమావతి, రణస్థలం రాంబాబు, వాసు, భుజంగరావు, శ్యాంబాబు, బాబూరావునాయుడు, జ్ఞానానందం, తదితరులున్నారు.

పరామర్శ..



వీరఘట్టం: యశోదమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మెరుగుల ఉమామహేశ్వరరావు, చంద్రమౌళి తల్లి యశోదమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శలో దమలపాటి వెంకటరమణనాయుడు, కనపాక సూర్యప్రకాశరావు, భోగి మణి, బెవర అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ప్రమాదాల నివారణ

పాలకొండ రూరల్: అనుకోని అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటిని అవగాహనతో అధిగమించాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని బుక్కూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడే విధానం, ప్రమాద తీవ్రత పెరగకుండా ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు మధుకుమార్, కృష్ణారావు, అప్పలనాయుడు, గణేష్‌కుమార్, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాలు..

నగరంలోని పలు విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాలల ఆవరణలో భోగి మంటలు వేశారు. రంగవల్లులు, హరిదాసులు, డూడూ బసవన్నల వేషధారణలతో విద్యార్థులు సందడి చేయగా... ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు, అతిథులు సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. – పాలకొండ రూరల్



భరతనాట్యంతో ఆకట్టుకుంటున్న చిన్నారులు



భోగి మంట వద్ద సందడి చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు